బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 20 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4

## 70 భవనాలు కూల్చివేత



బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్ లో అక్రమ కట్టడాలపై హైడ్రా ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇప్పటివరకు 70 భవనాలతో పాటు పలు ప్రాంతాల్లో ప్రహరీ గోడలు కూల్చివేశారు హైడ్రా అధికారులు. తాజాగా గండిపేటలోని ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించారు. ఒక్క గండిపేటలోనే 20కి పైగా భవనాలను కూల్చేశారు. చందానగర్ సర్కిల్ మదీనాగూడ చెరువులో 3, బాచుపల్లిలోని ఎర్రకుంటలో 3, గాజులరామారంలో 42 భవనాలను నేలమట్టం చేశారు. చెరువులను పరిరక్షించడమే తొలి ప్రాధాన్యతగా తీసుకున్నారు అధికారులు.

## ప్రధానికి రాఖీ కట్టిన చిన్నారులు..





- అప్యాయంగా ముచ్చటించిన ప్రధాని

బలగం టీవీ, న్యూఢిల్లీ

ప్రధాని మోదీ రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ఉదయాన్నే ఢిల్లీలోని ఓ పాఠశాలకు వెళ్లిన మోదీ విద్యార్థులతో ముచ్చటించారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.అనంతరం చిన్నారులంతా ఒక్కొక్కరుగా వచ్చి మోడీ చేతికి రాఖీలు కట్టారు. సందర్భానుసారం విభిన్న వేశధారణతో ఆకట్టుకునే మోడీ రాఖీ పండగకు కూడా తన ప్రత్యేకతను చాటుకున్నారు. మోడీ ధరించిన దుస్తులు నెటిజన్లను అమితంగా ఆకట్టుకున్నాయి. ఆయన ఇవాళ తెల్లటి కుర్తా, లేత ఆకుపచ్చ జాకెట్ ధరించి ఉన్నారు.

# క్రీడా రంగానికి కేంద్ర బిందువుగా తెలంగాణ

## స్పోర్ట్స్ యూనివర్సిటీపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్

దేశ క్రీడా రంగానికి తెలంగాణ కేంద్ర బిందువుగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఫోర్త్ సిటిలో భాగంగా తలపెట్టిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీపై ఉన్నతాధికారులతో చర్చించారు. రకరకాల క్రీడలు, అకాడమీలు, పాఠశాలలు, క్రీడా శిక్షణా సంస్థలన్నింటినీ ఒకే గొడుకు కిందకు తేవడంతో పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా యూనివర్సిటీ రూపుదిద్దుకోవాలని ఆదేశించారు. దశాబ్దాల కిందటే ఆఫ్రో-ఏసియన్ గేమ్స్ కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్ భవిష్యత్తులో ఒలింపిక్స్ క్రీడలకు వేదికగా నిలవాలని ముఖ్యమంత్రి అభిలషించారు.

ఒలింపిక్స్ నిర్వహించడమే కాకుండా మన క్రీడాకారులు పతకాలను దక్కించుకునేలా వర్సిటీని తీర్చిదిద్దాలని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిపుణులైన శిక్షకులతో శిక్షణ ఇప్పించాలని ఆదేశించారు. మన దేశం నుంచి ఒలింపిక్స్‌లో రాణించే షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, అర్చరీ, జావెలిన్ త్రో, హాకీకి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత శిక్షణ ద్వారా పతకాలు సాధించే అవకాశాలు ఉన్న మిగతా క్రీడల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. చిన్న తనంలోనే విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలను ఉపాధ్యాయలు గుర్తించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాంటి విద్యార్థులందరికీ ఆయా క్రీడల్లో శిక్షణ ఇచ్చేలా ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఒక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ పాఠశాలల్లో విద్యా బోధనతో పాటు క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఉండేలా శిక్షణ ఇప్పించాలన్నారు.

ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన దేశాలు, క్రీడాకారుల వివరాలను సేకరించి, క్రీడాకారులు శ్రమించిన తీరు, క్రీడల పట్ల ఆయా దేశాలు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.యంగ్ ఇండియాకు తెలంగాణ ఒక బ్రాండ్ గా మారాలని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీకి యంగ్ ఇండియా పేరు పెట్టిన తరహాలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీకి కూడా యంగ్ ఇండియా పేరును ఖరారు చేసిన విషయాన్ని వారు గుర్తుచేశారు.

## తెలంగాణ ఆత్మగౌరవంపై కాంగ్రెస్ దాడి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు



బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడమంటే తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి చేసినట్లేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. రాఖీ వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలపై ఆయన మండిపడ్డారు. రాజకీయాల్లో అధికారం, పదవులు శాశ్వతం కాదన్నారు. రాష్ట్ర ఆత్మగౌరవాన్నిచాటేలా కేసీఆర్ సచివాలయాన్ని కడితే.. కాంగ్రెస్ సర్కారు రాజీవ్ విగ్రహం చేయడమేంటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని.. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణకు, రాజీవ్‌కు ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. వందలమంది ప్రాణాలు తీసిన నాయకుడి విగ్రహం పెడతారా ? నిలదీశారు.

తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ప్రస్తుతం విగ్రహాన్ని పెట్టినా బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగించి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని తేల్చి చెప్పారు. అలాగే, రాష్ట్రంలో రాజీవ్ పేరుతో ఉన్న రింగ్ రోడ్డు, హైదరాబాద్ విమానాశ్రయం సహా ఇతర సంస్థల పేర్లను సైతం మారుస్తామని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణలో ఇందిరా గాంధీ, రాజీవ్ పేర్లతో హైదరాబాద్‌లో చాలానే ఉన్నాయన్న కేటీఆర్.. కాంగ్రెస్ ఇప్పటికైనా మారకుంటే అధికారంలోకి వచ్చాక మారుస్తామని తేల్చిచెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ మనసు మార్చుకుని అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్‌లో పెట్టుకో లేకపోతే జూబ్లీహిల్స్‌లో లేదంటే.. ఇంట్లో పెట్టుకోవాలన్నారు. అంతేగానీ తెలంగాణ తల్లిని అవమానిస్తే ఊరుకోమన్నారు.

## రుణమాఫీ కాలేదన్న రైతులను అరెస్టులు చేస్తారా?:

- ఎమ్మెల్యే హరీశ్‌రావు



బలగం టీవీ, హైదరాబాద్

హరీశ్‌రావు రుణమాఫీ కాలేదన్న రైతులను అరెస్టులు చేస్తారా అని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూ అప్రజాస్వామిక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించడం సిగ్గుచేటని విమర్శించారు. రుణమాఫీ కాలేదని అదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలియచేస్తున్న రైతులను అరెస్టులు చేయడం హేయమైన చర్య అన్నారు. పోలీసు యాక్ట్ పేరు చెప్పి, జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు హుకుం జారీ చేయడం హక్కులను కాలరాయడమేనని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలియచేస్తున్న రైతులను ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారని, అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులు రుణమాఫీ కాకపోవడంతో కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగి వేసారి పోతున్నారని చెప్పారు. ఏం చేయాలో తెలియక చివరకు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నదని వెల్లడించారు. ప్రభుత్వం రైతుల రుణమాఫీ సమస్యకు పరిష్కారం చూపకుండా, పోలీసులను పురమాయించి గొంతెత్తిన వారిని బెదిరించడం, అణగదొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమని విమర్శించారు.

ఒకవైపు రైతుబంధు రాక, మరోవైపు రుణమాఫీ కాక అన్నదాత ఆవేదనలో ఉన్నాడని చెప్పారు. వ్యవసాయ పనులు చేసుకోవాలా లేక రుణమాఫీ కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాలా అంటూ కన్నీరు పెట్టుకుంటున్నారని వెల్లడించారు. ఏకకాలంలో ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆచరణలో మాత్రం అట్టర్ ఫ్లాప్ అయ్యారని ఎద్దేవాచేశారు. నమ్మి ఓటేసినందుకు రైతన్నను నట్టేట ముంచారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడ్డట్లు చరిత్రలో లేదన్న విషయాన్ని కాంగ్రెస్ పాలకులు మరిచిపోయినట్లున్నారని చెప్పారు. ఇప్పటికైనా కండ్లుతెరిచి రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ఆందోళనలో ఉన్న రైతాంగానికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేశారు. అదిలాబాద్ సహా ఇతర జిల్లాల్లో రైతన్నలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే అరెస్టు చేసిన రైతన్నలకు అండగా బీఆర్ఎస్ పార్టీ కార్యచరణ ప్రకటిస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.




## విజృంభిస్తున్న మంకీపాక్స్

- మంకీపాక్స్ పట్ల అప్రమత్తంగా ఉండండి..

విమానాశ్రయాలకు కేంద్రం సూచన

బలగం టీవీ, హైదరాబాద్

వేగంగా విస్తరిస్తున్న ప్రాణాంతక మంకీ పాక్స్ వైరస్ పట్ల కేంద్రం అప్రమత్తమైంది. సౌదీ అరేబియా నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు వచ్చిన వ్యక్తిలో మంకీ పాక్స్ లక్షణాలు కనిపించాయి. స్వీడన్, ఫిలిప్పీన్స్ లోనూ వైరస్ లక్షణాలను నిర్ధారించారు. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్, పాకిస్థాన్ సరిహద్దుల్లోని విమానాశ్రయాలు, లాండ్ పోర్టుల అధికారులు.. మంకీ పాక్స్ లక్షణాలతో వచ్చే ప్రయాణికుల విషయమై అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆరోగ్యశాఖ అలర్ట్ జారీ చేసినట్లు తెలిసింది.

మంకీ పాక్స్ వ్యాధిని ఎదుర్కోవడానికి ఢిల్లీలోని మూడు కేంద్ర ప్రభుత్వ దవాఖానలను నోడల్ కేంద్రాలుగా కేంద్ర ఆరోగ్యశాఖ గుర్తించింది. రామ్ మనోహర్ లోహియా దవాఖాన, సఫ్దర్ జంగ్ దవాఖాన, లేడీ హార్డింగ్ దవాఖానల్లో ఐసోలేషన్ కేంద్రాల ఏర్పాటు, చికిత్సకు ఏర్పాట్లు చేయనున్నది. నోడల్ కేంద్రాలు గుర్తించి మంకీ పాక్స్ వైరస్ ను గుర్తించడానికి సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిన సమాచారం ప్రకారం 2022 నుంచి ఇప్పటి వరకూ 116 దేశాలకు విస్తరించిన మంకీ పాక్స్.. 99,176 మందికి సోకింది. ఇటీవల కాంగోలో వేగంగా విస్తరిస్తున్న ఈ వైరస్ వల్ల ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది 15,600 కేసులు నమోదు కాగా, 537 మంది రోగులు మరణించారు. 2022 నుంచి భారత్ లో 30 మంకీ పాక్స్ కేసులు నమోదు కాగా, గత మార్చిలో చివరి కేసు గుర్తించామని కేంద్రం తెలిపింది.

వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మంకీపాక్స్‌ను గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది. అప్పటినుంచి ఈ వ్యాధి గురించి చాలా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మంకీపాక్స్ అనేది జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే ఒక జూనోటిక్ వైరస్ వల్ల వచ్చే వ్యాధి. ఈ వైరస్ మొదట 1958లో కోతుల్లో, తర్వాత 1970లో మనుషుల్లో కనిపించింది. ఇది చాలా అరుదైన వ్యాధి. దీని బారిన పడిన వారికి దద్దుర్లు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మంకీపాక్స్ లక్షణాలు, స్మాల్‌పాక్స్ లక్షణాల మాదిరిగానే ఉంటాయి. ఈ వ్యాధి ఉన్న వ్యక్తిని తాకినా లేదా వారికి దగ్గరగా ఉన్నా.. ఇది ఇతరులకు సోకే అవకాశం ఉంటుంది. ఈ డిసీజ్ ఉన్న జంతువులను తాకినా, మనుషులకు సోకవచ్చు.

మంకీపాక్స్ ఎంత త్వరగా వ్యాపిస్తుందో అనేది ఇన్ఫెక్షన్ స్టేజ్, వ్యాధి ఉన్న వ్యక్తిని ఎలా తాకామనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఈ వ్యాధి మూడు దశల్లో వ్యాపిస్తుంది. అవి ఇంక్యుబేషన్ పీరియడ్ , సింప్టమాటిక్ పీరియడ్, వ్యాధి ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉన్న సమయం.

**ఇంక్యుబేషన్ పీరియడ్**

మంకీపాక్స్ వైరస్ శరీరంలోకి వెళ్లిన తర్వాత 5 నుంచి 21 రోజుల వరకు వ్యాధి లక్షణాలు కనిపించవు. ఈ సమయంలో కూడా బాధితులకు తెలియకుండానే వ్యాధి ఇతరులకు సోకే అవకాశం ఉంది. మిగితా 2వ పేజీలో

### మేము వినగలుగుతున్నాం..

## మీరు ఉన్నందుకు థాంక్యూ సీఎం..

- ముఖ్యమంత్రితో రాఖీ సంబురాల్లో వినికిడి లోపాల నుంచి కోలుకున్న చిన్నారులు



బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో శస్త్రచికిత్సలు చేయించుకుని వినికిడి లోపాల నుంచి కోలుకున్న పలువురు చిన్నారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీలు కట్టి ప్రేమాభిమానాలు చాటుకున్నారు. ఇటీవల విజయవంతంగా సర్జరీలు చేయించుకున్న చిన్నారుల్లో కొందరు తమ కుటుంబాలతో కలిసి సోమవారం సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రితో రాఖీ సంబురాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ రాష్ట్రంలో పిల్లలు ఎవరైనా ఖరీదైన వైద్యం అందక మూగ, చెవిటి వారుగా మిగిలిపోవద్దని చెప్పారు. అలాంటి వారికి ఎంత ఖర్చయినా సరే వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించినందుకు పిల్లల కుటుంబీకులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్ ఆచార్య గారు, వైద్యురాలు డాక్టర్ డీకే వీణ పాల్గొన్నారు.

పుట్టుకతో వినికిడి సమస్యలున్న పిల్లలకు ఐదేండ్ల వయసులోపు చికిత్స అందిస్తే కోలుకునే అవకాశాలు ఎక్కువ. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అలాంటి చిన్నారుల వైద్యానికి అవసరమైన సహాయాన్ని వేగంగా అందిస్తున్నారు. హైదరాబాద్ కోఠిలోని ఈఎన్‌టీ ఆసుపత్రిలో కోక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు ఇటీవల పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. ఎల్‌వోసీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా చిన్నారులకు ఉచితంగా సర్జరీలు చేయడం, ఖరీదైన వినికిడి యంత్రాలు అందించడమే కాకుండా ఏడాది పాటు ఏవీటీ కూడా అందిస్తున్నారు.



## కేటీఆర్‌తో శ్రీలంక మంత్రి భేటీ

బలగం టీవీ, హైదరాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను శ్రీలంక మంత్రి సదాశివం వియలేంద్రన్ ఆయన నివాసంలో కలిశారు. బిఆర్ఎస్ సర్కార్ హయాంలో రాష్ట్రాభివృద్ధిపై కేటీఆర్‌ను ఆయన అభినందించారు. బీఆర్ఎస్ పనితీరు తమకు స్ఫూర్తిగా నిలిచిందని సదాశివం అన్నారు. 'మీ పాలన మాకు ఆదర్శం. బిఆర్ఎస్ పదేళ్లలో అనూహ్య ప్రగతి సాధించింది. గతంలో శ్రీలంక పార్లమెంట్‌లోనూ ఈ విషయాన్ని నేను ప్రస్తావించా. హైదరాబాద్ అభివృద్ధి సింగపూర్‌ను తలపించేలా ఉంది. మాజీ సిఎం కేసీఆర్, కెటిఆర్ తెలంగాణను పెట్టుబడులకు కేరాఫ్‌గా మార్చా రు. ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పెరుగుతుంటే, రాష్ట్రాన్ని అవకాశాల అక్షయపాత్రగా మార్చిన మీ తీరు మాకు స్ఫూర్తిదాయకం' అని సదాశివం వెల్లడించారు.

సదాశివంతో సమావేశం అనంతరం కెటిఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన మాటలు బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం చేసిన పనులను గుర్తు చేశాయన్నారు. 'తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిపై ఆయన నాతో సుదీర్ఘంగా చర్చించారు. పదేళ్ల అత్యల్ప కాలంలో రాష్ట్రం ఇంతగా పురోగమిం చడంపై గర్వంగా ఉంది. హైదరాబాద్‌ను అవకాశాల హబ్‌గా మార్చడంలో మా కృషిని గుర్తించినందుకు మంత్రి సదాశివంకు కృతజ్ఞతలు. దశాబ్ద కాలంలో బిఆర్ఎస్ పాలన ఎంత అంకితభావంతో సాగిందో మంత్రి సదాశివం నాతో పంచుకున్నారు. బిఆర్ఎస్ సంపద సృష్టించడమే కాకుండా, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలను ఆదుకున్న విషయాన్ని నేను ఆయనకి వివరించా'అని కెటిఆర్ తన పోస్ట్‌లో వెల్లడి చేశారు.

## 13 మంది బాలికలపై లైంగిక వేధింపులు



బలగం టీవీ, హైదరాబాద్

కోల్‌కతా వైద్యురాలి హత్యాచార సంఘటనపై దేశవ్యాప్తంగా అట్టుడుకుతుంటేతమిళనాడులో ఎన్‌సిసి క్యాంపులో ఒకరిపై లైంగికదాడి, మరో 12 మంది బాలికలపై లైంగిక వేధింపులకు సంబంధించిన దారుణ ఘటన వెలుగు లోకి వచ్చింది. బాధిత అమ్మాయిలు ఆగస్టు 9న ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పోలీసులకు ఫిర్యాదు లేకపోవడంతో తల్లిదండ్రుల వరకు వెళ్లింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు శివరామన్‌ను, స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్లు సహా మొత్తం 11 మందిపై పోక్సో కేసు నమోదు చేశారు. నామ్ తమిళర్ కట్చి అనే రాజకీయ పార్టీకి చెందిన శివరామన్ ఇటీవల కృష్ణగిరి జిల్లాలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు వెళ్లి అక్కడ ఎన్‌సిసి యూనిట్ లేనప్పటికీ, ఎన్‌సిసి క్యాంప్ నిర్వహించేలా ప్రయత్నించాడు. దీనివల్ల స్కూల్ కు ఎన్‌సిసి యూనిట్ నిర్వహించే అర్హత వస్తుందని నమ్మించాడు. ఈమేరకు ఆగస్టు 5 నుంచి 9 వ తేదీవరకు నిర్వహించిన క్యాంప్‌కు 41 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 17 మంది బాలికలు ఉన్నారు. అమ్మాయిలకు మొదటి అంతస్తులోని స్కూల్ ఆడిటోరియం, అబ్బాయిలకు గ్రౌండ్ ఫ్లోర్‌లో వసతి కల్పించారు. దీన్ని పర్యవేక్షించడానికి ఉపాధ్యాయులు లేక పోవడంతో దీన్ని ఆసరా చేసుకున్న శివరామన్ 8 వ తరగతి చదువుతున్న 13 ఏండ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమెతోపాటు మరో 12 మందిని లైంగికంగా వేధించాడు.

## తెలంగాణ భవన్‌లో రాఖీ సంబరాలు..




బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ భవన్‌లో రాఖీ పండుగ సంబురాలు ఘనంగా నిర్వహించారు. రాఖీ పండగను పురస్కరించుకొని తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకలకు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ మహిళా ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలుకేటీఆర్‌కు రాఖీ కట్టారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మున్సిపల్ మహిళా చైర్మెన్‌లు, కార్పొరేషన్ మహిళా మాజీ చైర్మెన్లు, కార్పొరేటర్లు, పలువురు పార్టీ కార్యకర్తలు కేటీఆర్‌కి రాఖీలు కట్టారు.

రాష్ట్రంలోని ప్రతి సోదర సోదరీమణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు. మా సోదరీమణి కవిత గారు ఈ రాఖీ పౌర్ణమి పండగ రోజు తనకు రాఖీ కట్టే పరిస్థితి లేకపోవడం బాధాకరం. 155 రోజులుగా కవిత వేదన అనుభవిస్తున్నారో, దానికి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందని నమ్మకం ఉన్నదన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా పండుగను పురస్కరించుకొని వచ్చి రాఖీ కట్టిన ప్రతి ఒక్క ఆడబిడ్డకు కేటీఆర్ ధన్యవాదాలు తెలియజేశారు..

# ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను హరిస్తోన్న బీజేపీ



బలగం టీవి, న్యూఢిల్లీ

లేటరల్ ఎంట్రీ పేరుతో దళితులు, ఓబీసీలు, ఆదివాసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లను బీజేపీ లాక్కుంటోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఉన్నతోద్యోగాలను దొడ్డిదోవన ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు ఇస్తోందని పేర్కొన్నారు. బీజేపీ రామరాజ్యం పేరుతో రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని మండిపడ్డారు.

రాహుల్ ఆరోపణలపై కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ లేటరల్ ఎంట్రీ విషయంలో ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందని ప్రత్యారోపణలు చేశారు. లేటరల్ ఎంట్రీ నియామకాల్లో పాటించే నిబంధనలను ఉటంకించారు. ఈ విధానంలోనూ రిజర్వేషన్లను కచ్చితంగా పాటించాలంటూ 2020లో కేంద్ర హెూంశాఖ విడుదల చేసిన ఓ మెమోను కూడా ఆయన పోస్టు చేశారు.

"ఉన్నత ఉద్యోగాల్లో లేటరల్ ఎంట్రీపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు ఆ పార్టీ ద్వంద్వ వైఖరిని సూచిస్తున్నాయి. ఈ విధానాన్ని తీసుకొచ్చింది గత యూపీఏ ప్రభుత్వమే. 2005లో వీరప్ప మొయిలీ అధ్యక్షతన నియమించిన రెండో ఎస్సార్సీ సైతం ఈ విధానాన్ని బలంగా సమర్థించింది. దాన్ని అమలు చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం పారదర్శక విధానాన్ని తీసుకొచ్చింది" అని అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

రాహుల్ గాంధీ 'లేటరల్ ఎంట్రీ'పై చేసిన వ్యాఖ్యలతో పెద్ద దుమారమే చెలరేగుతోంది. లేటరల్ ఎంట్రీ పద్ధతిలో 45 మంది సంయుక్త కార్యదర్శులు, ఉపకార్యదర్శులు/ డైరెక్టర్ల నియామకానికి యూపీఎస్సీ ఇటీవల దరఖాస్తులను ఆహ్వానించింది. దీన్ని రాహుల్‌గాంధీ తప్పుపట్టారు. ఇది జాతి వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్లను బీజేపీ లాక్కోవాలని చూస్తోందని ఆరోపించారు. ఉన్నతస్థానాల్లో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం దక్కడం లేదని, దీన్ని మెరుగుపరిచే బదులు, లేటరల్ ఎంట్రీ ద్వారా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు ఆ పదవులను కట్టబెట్టాలని చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు ఈ విధానాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని, కానీ ఆ పార్టీ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని బీజేపీ అంటోంది.


# తెలంగాణలో నాలుగు రోజులు వర్షాలే..



బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణలో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక మీదుగా ఉన్న ఆవర్తనం రాయలసీమ, పరిసర ప్రాంతాల మీదుగా సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించిందని చెప్పింది. ద్రోణి సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు రాయలసీమ, పరిసర ప్రాంతాల మీదుగా ఉపరితల ఆవర్తనం తమిళనాడు నుంచి కొమొరిన్ ప్రాంతం వరకు విస్తరించి ఉందని చెప్పింది. సోమవారం నుంచి మంగళవారం వరకు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది.అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వస్తాయని పేర్కొంది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరిలో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. అలాగే, బుధ, గురువారాల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వానలు పడే సూచనలున్నాయని తెలిపింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో కొత్తగూడెం, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, జనగాం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా జనగామలో 9 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది.

# 'పార్టీలో ఎన్నో అవమానాలు



బలగం టీవి, న్యూఢిల్లీ

మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఝార?ండ్ రాజకీయాల్లో కీలక పరిణామాలు జరుగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, జేఎంఎం నేత చంపయీ సోరెన్ బీజేపీలో చేరుతారని జోరుగా ప్రచారం సాగుతోంది. తన ఎక్స్(ట్విట్టర్) అకౌంట్? నుంచి జేఎంఎం పేరును చంపయీ తాజాగా తొలగించారు. దీంతో ఆయన పార్టీ మారడం ఖాయమే అనే అనుమానాలు మరింత బలపడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయన స్పందించారు. బీజేపీలో చేరిక విషయంపై స్పష్టత ఇవ్వకపోయినప్పటికీ, సుదీర్ఘ లేఖను విడుదల చేశారు. జేఎంఎం పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నందునే ప్రత్యామ్నాయం కోసం చూడాల్సి వచ్చిందని తెలిపారు. చంపాయీ సోరెన్?. తన ముందు మూడు మార్గాలున్నాయని తెలిపారు. "పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న తర్వాత ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకోవాల్సి వచ్చింది. ఈ రోజు నుంచి జీవితంలో కొత్త అధ్యాయం మొదలు కాబోతోందని ఇటీవలి శాసనసభా పక్ష సమావేశంలో చెప్పాను. నా ముందు మూడు మార్గాలున్నాయి. ఒకటి రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగడం, రెండోది సొంతంగా పార్టీ పెట్టడం, చివరగా ఎవరైనా తోడుగా నిలిస్తే వారితో కలిసి పనిచేయడం. ఇప్పటినుంచి అసెంబ్లీ ఎన్నికల వరకు నా ముందు ఈ మూడు మార్గాలున్నాయి" అని చంపయీ సోరెన్ పేర్కొన్నారు.

మరోవైపు ఆయన ఆరుగురు పార్టీ ఎమ్మెల్యేలతో ఆదివారం ఢిల్లీ చేరుకున్నారని తెలుస్తోంది. ఈ విషయంపై మీడియా ఆయనను ప్రశ్నించగా సొంత పని మీద ఢిల్లీకి వచ్చినట్లు పేర్కొన్నారు. చంపాయీతో ఉన్న ఎమ్మెల్యేలను పార్టీ సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులో లేనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన పలువురు బీజేపీ అగ్రనేతలతో టచ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల ఆయన బంగాల్ బీజేపీ నేత సువేందు అధికారి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో చర్చలు జరిపిన్నట్లుగా సమాచారం. భూ కుంభకోణం కేసులో హేమంత్ సోరెన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జనవరి 31న అరెస్టు చేసింది. ఆ తర్వాత సోరెన్ కుటుంబానికి సన్నిహితుడిగా ఉన్న చంపాయీ సోరెన్‌ను ముఖ్యమంత్రిగా నియమించారు. అనంతరం హేమంత్‌కు ఝార్ఖండ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అయితే తనను సీఎం పదవి నుంచి తప్పించడం వల్ల చంపయీ పార్టీ వీడాలని నిర్ణయించుకున్నట్లుగా సమాచారం.





# కేటీఆర్‌కు రాఖీ కట్టిన నాలుగేండ్ల చిన్నారి

బలగం టీవి, హైదరాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతిక అనే నాలుగేండ్ల చిన్నారి రాఖీ కట్టి తన అభిమానాన్ని చాటింది. జనవరిలో వీధి కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన కృతికకు కేటీఆర్ వైద్యం చేయించి, ఆ పాపను ప్రాణాలతో కాపాడారు. దీంతో తన ప్రాణాలను కాపాడిన కేటీఆర్ పట్ల కృతిక గొప్ప మనసు చాటుకుంది. రాఖీ పండుగ సందర్భంగా తన తల్లితో కలిసి కేటీఆర్‌కు రాఖీ కట్టి అభిమానాన్ని చాటింది కృతిక. రామంతాపూర్ రాంరెడ్డినగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న కృతిక(4)పై వీధి కుక్క దాడి చేసిన సంగతి తెలిసిందే. వీధి కుక్క చిన్నారి మొహం, చెవి కొరికింది. కుక్క దాడిలో చిన్నారి చెవి సగం తెగిపోయింది. గాయాలపాలైన చిన్నారిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై కేటీఆర్ తక్షణమే స్పందించి కృతికకు కావాల్సిన వైద్యం చేయించారు.

# నగరంలో భారీ వర్షం

- తడిసిముద్దైన భాగ్యనగర వాసులు

బలగం టీవి, హైదరాబాద్

భారీ వర్షానికి భాగ్యనగరం విలవిలలాడింది. అరగంటకు పైగా కురిసిన వర్షానికి నగరం అతలాకుతలం అయ్యింది. రహదారులు వరదకాలువలుగా మారాయి. రాజధాని పూర్తిగా చెరువును తలపించింది. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో నగరంలోని ప్రధాన రహదారులపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ అయ్యింది. దీంతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, మియాపూర్, చందానగర్, షేక్‌పేట్, మెహిదీపట్నం, ఫిలింనగర్, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కూకట్‌పల్లి, ఉప్పల్,మల్కాజిగిరి,నాగోల్, బేగంపేట్, ముషిరాబాద్, లక్డికాపూల్,నాంపల్లి,కోఠి,ఎల్బీనగర్,రాజేంద్రనగర్,అత్తాపూర్,లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో నగరంలోని పలుప్రాంతాల్లోని ప్రధాన రహదారులు వరదకాలువల్లాగా మారాయి. షేక్‌పేట్,యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో కార్లు నీటమునిగాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో భారీగా ట్రాఫిక్‌జాం అయ్యింది. షేక్‌పేట్ ఫ్లై ఓవర్ వద్ద భారీగా వరదనీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. యూసుఫ్‌గూడలో వాహనాలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి.

దీంతో లక్డికాపూల్ నుంచి గచ్చిబౌలి,గచ్చిబౌలి నుంచి మాదాపూర్,హైటెక్‌సిటీ, మియాపూర్ వెళ్లే ప్రాంతాలు, చందానగర్ నుంచి బాలానగర్, బాలానగర్ నుంచి మాసాబ్‌ట్యాంక్,సికింద్రాబాద్ నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే రహదారులపై భారీగా ట్రాఫిక్‌జామ్ అయ్యింది. కిలోమీటర్ దూరానికి కూడా అరగంటకు పైగా సమయం పట్టడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యాయి. సోమవారం రాఖీ పండగ సందర్భంగా కుటుంబమంతా సోదరసోదరీమణులకు రాఖీలు కట్టేందుకు వెళ్తుండటంతో నగరం సందడిగా మారింది. పెద్ద ఎత్తున వాహనాలు రోడ్డెక్కడంతో అప్పటికే రహదారులు రద్దీగా మారాయి. అయితే, మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో నగరంలోని పలు ప్రాంతాల్లో భారీవర్షం కురవడం%ొ%ఒక్కసారిగా రహదారులపై వరదనీరు చేరడంతో నగరం నరకాన్ని తలిపించింది. సాయంత్రం వరకు నగర రహదారులపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఇదిలావుండగా, నగరంలో వర్షాలు కురిసినప్పుడే అధికారులు స్పందిస్తున్నారే తప్పా ఇబ్బందులు తలెత్తకుండా ముందుస్తుగా ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని నగరవాసులు మండిపడుతున్నారు.

# ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరిస్తాం




- రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

అంకిత భావంతో సృజనాత్మకంగా తీసిన ఒక ఫొటో కొన్ని పేజీల వార్తా సారాంశాన్ని అర్థవం తంగా తెలియజేసి, పాఠకులను ఆలోచింప చేస్తుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భం గా సోమవారం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఫొటోగ్రఫీ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు దినపత్రికలు చదవటం అలవాటని, అన్ని వార్తలు చదవక పోయినా అన్ని పేజీలలోని ఫొటోలను చూసి, ఆ వార్తలోని అంశాన్ని అర్థం చేసుకుంటానని తెలిపారు. తెలం గాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభయహస్తం హామీలపై నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలకు వచ్చిన ఫొటో ఎంట్రీలను ఇక్కడ ప్రదర్శించారు. ఉత్తమ ఫొటో గ్రాఫర్లను సన్మానించి అభినందించారు. ఫొటోగ్రాఫర్ల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## నిలకడగా మోహన్‌లాల్ ఆరోగ్యం

బలగం టీవి, హైదరాబాద్

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ అస్వస్థతకు గురై కొచ్చిలోని ఆసుపత్రిలో చేరారు. తాజాగా ఆయన ఆరోగ్యంపై ఆస్పత్రి వర్గాలు ఓ ప్రకటన విడుదల చేశాయి. ప్రస్తుతం మోహన్ లాల్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అయితే, ఆయన తీవ్రమైన జ్వరం, వైరల్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ముఖ్యంగా రద్దీ ప్రదేశాలను నివారించేందుకు ఐదు రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు.

## విజృంభిస్తున్న మంకీపాక్స్

(మొదటి పేజీ తరువాయి)

**సింప్టమాటిక్ పీరియడ్**

ఈ దశలో జ్వరం, దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమయంలో వైరస్ ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంటుంది. దద్దుర్లు మొత్తం తగ్గిపోయి, పుండ్లు మానిపోయి పొక్కులు ఊడి పోయిన తర్వాత వ్యాధి వ్యాపించే అవకాశం తగ్గుతుంది.మంకీపాక్స్ ఉన్న జంతువుల రక్తం, శరీర ద్రవాలు లేదా పుండ్లను నేరుగా తాకితే ఈ వ్యాధి వచ్చే అవకాశం పెరుగుతుంది. జంతువులను తాకేటప్పుడు సరైన రక్షణ తీసుకోకపోతే ఈ వైరస్ సోకుతుంది. వైరస్ వేగంగా స్ప్రెడ్ అవుతున్న ప్రాంతంలో నివసించే వారికి ఈ వ్యాధి త్వరగా రావచ్చు. వైరస్ సోకిన జంతువులు లేదా మనుషులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని ప్రజలకు రిస్క్ ఎక్కువ.

వ్యాధిగ్రస్తుల రక్తం, శరీర ద్రవాలు లేదా ఇతర వస్తువులను తాకితే మంకీపాక్స్ బారిన పడిన రోగి వాడే గ్లాసు, ఫోన్ వంటి వస్తువులను ఇతరులు ఉపయోగించడం ప్రమాదకరం. చాలా మంది వ్యక్తులు ఉండే ప్రదేశాల్లో లేదా పరిశుభ్రత లేని ప్రదేశాల్లో వ్యాధి త్వరగా వ్యాపిస్తుంది.

### ప్రభుత్వ ఉద్యోగులందరూ

# రాష్ట్ర ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలి

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

బలగం టీవి, హైదరాబాద్



ప్రభుత్వ ఉద్యోగులందరూ కలిసి రాష్ట్ర ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం సచివాలయంలో ఎస్పీడీసీఎల్‌లో పదోన్నతులు పొందిన అధికారులు, ఉద్యోగులు.. ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కను అభినందించారు.ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి భట్టి విక్రమార్క ప్రసంగించారు. ప్రజల జీవితాల్లో మార్పు అంటే వారి జీవనస్థితిగతులు మారడం, కొనుగోలు శక్తి పెరగడం, రాష్ట్ర సంపదలో అంతా భాగస్వాములు కావడం ఆ మార్పు వచ్చినప్పుడే పోరాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రానికి ఫలితం ఉంటుందన్నారు. ఉద్యోగులందరూ కూడా ఈ రాష్ట్రం నాది, ఈ ప్రభుత్వం నాది, ఈ రాష్ట్ర ప్రజలు నా వాళ్ళు, వాళ్ల సేవ కోసమే నేను నియమించబడ్డారని మీరంతా భావించాలని ఉద్యోగులు, అధికారులకు సూచించారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఉద్యోగులు, అధికారులు బాగా పనిచేసే వాతావరణ కల్పించడం కోసం పదోన్నతులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు, ఆలోచనలను అమలు చేసే క్రమంలో కింది స్థాయి వరకు ఉద్యోగులు, అధికారులు నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. మీ కష్టసుఖాల్లో ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుంది. మీరు ప్రజల కష్టసుఖాల్లో భాగం కావాలని సూచించారు. అధికారులు, ఉద్యోగులు పెట్టే ప్రతి సంతకం, తీసుకునే ప్రతి నిర్ణయం, చేసే ప్రతి పని సామాన్యుడికి ఉపయోగపడేలా ఉండాలని తెలిపారు. మీ పనిలో మానవీయకోణం ఉండాలని విక్రమార్క అన్నారు.

# మంకీపాక్స్‌పై వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి



- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ

**మంత్రి దామోదర రాజనర్సింహా**

బలగం టీవి, హైదరాబాద్

మంకీపాక్స్‌పై వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశించారు. సచివాలయంలో అధికారులతో మంకీపాక్స్‌పై మంత్రి దామోదర రాజనర్సింహా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు మంకీపాక్స్ కేసులు నమోదు కాలేదని మంత్రికి అధికారులు తెలిపారు. ఈ వ్యాధి పట్ల ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్న మంత్రి రాజనర్సింహా, వైద్యారోగ్య శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మంకీపాక్స్ నివారణ మందులు : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మంకీపాక్స్ చికిత్సకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని మంత్రి తెలిపారు. గాంధీ, ఫీవర్ ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని దామోదర రాజనర్సింహా సూచించారు. సమీక్షలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, కమిషనర్ ఆర్.వి.కర్ణన్, డీహెచ్ రవీందర్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్ట్ 29 వరకు సీఎంపై ఎలాంటి చర్యలొద్దు..




- ట్రయిల్ కోర్టుకు కర్ణాటక హైకోర్టు ఆదేశాలు

**బలగం టీవి, బెంగళూరు**

కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. ఆగస్ట్ 29వ తేదీ వరకు ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకో వద్దని ట్రయిల్ కోర్టును కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. ముడా కుంభకోణంలో సీఎం సిద్దరామయ్యను ప్రాసిక్యూషన్ చేసేందుకు ఆ రాష్ట్ర గవర్నర్ తవర్‌చంద్ గెహ్లాత్ అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. గవర్నర్ ఆదేశాలను నిలిపివేయాలంటూ సీఎం సిద్దరామయ్య సోమవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

ఈ రిట్ పిటిషన్‌పై సింగిల్ బెంచ్ జడ్జి హేమంత్ చందన్‌గౌడ్ ఆధ్వర్యంలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య తరపు న్యాయవాదీ అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలను వినిపించారు. ఆ క్రమంలో ఆగస్ట్ 29వ తేదీ వరకు సీఎం సిద్దరామయ్యను ఎలాంటి విచారణ జరప వద్దని న్యాయమూర్తికి వివరించారు. దీంతో న్యాయవాది సింఘ్వీ వాదనలతో సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన గౌడ్ ఏకీభవించారు. దీంతో ఆగస్ట్ 29వ తేదీ వరకు ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకో వద్దని ఆదేశించింది.

మైసూర్ నగరాభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణంలో సీఎం సిద్దరామయ్య ప్రమేయం ఉందంటూ.. సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ, టీజే అబ్రహం తదితరులు.. ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీఎం సిద్దరామయ్యను ప్రాసిక్యూషన్ చేసేందుకు ప్రత్యేక కోర్టుకు గవర్నర్ తావర్ చంద్ గెహ్లాత్ ఆగస్ట్ 17వ తేదీన అనుమతి ఇస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను వెంటనే రద్దు చేయాలంటూ సిఎం సిద్దరాయమ్య.. సోమవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌ను సోమవారం సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన్ గౌడ్ విచారించారు. సీఎం సిద్దరామయ్యను ఆగస్ట్ 29వ తేదీ వరకు ప్రాసిక్యూషన్ చేయకూడదంటూ సింగిల్ జడ్జి జస్టిస్ హేమంత్ చందన్ గౌడ్ ఆదేశించారు. దీంతో సీఎం సిద్దరామయ్యనకు తాత్కాలిక ఉపశమనం లభించినట్లు అయింది.

# దుర్గకు అండగా సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**



తల్లి ఆత్మహత్యతో ఒంటరిగా మిగిలిపోయిన బాలిక దుర్గకు అన్ని విధాలా అండగా నిలుస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలం బేల్‌తరోడా గ్రామానికి చెందిన ఒంటరి మహిళ మేర గంగామణి (36) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆమె ఏకైక కుమార్తె దుర్గ (11) అనాథగా మిగిలింది. తల్లి అంత్యక్రియలకు డబ్బులేకపోవడంతో దుర్గ భిక్షాటన చేసింది.విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. బాలికకు విద్య, వైద్య, ఇతర అవసరాలకు అండగా నిలవాలని రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు బాలికకు ఉచిత విద్య అందించేందుకు గురుకుల పాఠశాలలో చేర్చుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. వైద్య, ఇతర సమస్యలేమైనా ఉంటే వాటిని వెంటనే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.

# గంజాయి సేవిస్తున్న ఆరుగురు అరెస్ట్




- రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంజాయి కిట్ల సహాయంతో..

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

గంజాయి రహిత జిల్లాగా మార్చడాని జిల్లా పోలీస్ విస్తృత కార్యక్రమలు చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని, జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ లు,నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో విస్తృతంగా గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్ట్ లు చేస్తూ గంజాయి సేవించే వారిని అదుపులోకి తీసుకోవడం జరుగుతుందని గడిచిన రెండు రోజుల వ్యవధిలో సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో ఇద్దరూ నిందుతులు ఒల్లెపు వంశీ,ఒల్లెపు బీమ్రాజ్ అదుపులోకి తీసుకొని వారి వద్ద 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.కొనరావుపేట్ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు నిందుతులు గాజులవేణి అరుణ్,అజ్మీర వికాస్ లను అదులోకి తీసుకొని వారి వద్ద 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందని, తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు నిందుతులు లింగం సాయి, గంగాధర సాగర్ లను అదుపులోకి తీసుకొని వారి వద్ద 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గంజాయికి సంబంధించిన సమాచారం డయల్ 100 లేదా టాస్క్ ఫోర్స్ సి.ఐ ఫోన్ నెంబర్ 87126 56392 కి సమాచారం అందించగలరని,సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు.

# తనువు లేకున్నా...తానున్నాడు..

- ఆరుగురికి పునర్జన్మని ఇచ్చిన "నరేష్ "
- బ్రెయిన్ డెడ్ అయిన కుమారుడి అవయదానం..
- తల్లి ఉదారత నిర్ణయాన్ని ప్రశంసించిన స్థానికులు

**బలగం టీవీ, గంభీరావుపేట :**




అచేతనంగా పడి ఉన్న కొడుకును చూసి కన్నపేగు కలచివేస్తున్నా.. గుండె లోతు నుండి దుఃఖం తన్నుకొస్తున్నా.. కడుపుకోత తనువును దహించి వేస్తున్నా. కొడుకు లేడు అనే బాధ గుండెను పిండేసేస్తున్న, అ పెనువిషాదాన్ని పంటిబిగువనే భరిస్తూ ఆ తల్లి కొండంత ఔదార్యం చూపారు.

పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ మాతృమూర్తి చూపిన ఔదార్యం ఆరుగురికి పునర్జన్మనిచ్చింది. బ్రెయిన్ డెడ్ అయిన అ కొడుకు అవయవాలను దానం చేసి ఆదర్శంగా నిలిచింది ఆ కన్నతల్లి.స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన ద్యానబోయిన నర్సింలు– దేవలక్ష్మి లకు కుమారడు ద్యానబోయిన నరేష్ (27), కూతురు నవిత ఉన్నారు. ద్యానబోయిన నర్సింలు సంవత్సరన్నర క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, తండ్రి అనారోగ్యానికి చేసిన అప్పులు తీర్చడానికి, కుటుంబానికి అండగా నిలబడడానికి ద్యానబోయిన నరేష్ దుబాయి వెళ్లి చెల్లి పెళ్లి చేసి మళ్లి తిరిగి దుబాయ్ వెళ్దామని రెండు నెలల క్రితం స్వగ్రామం నర్మాలకి వచ్చాడు. గత మంగళవారం లింగన్నపేట గ్రామంలో నరేష్ బంధువులు చనిపోగా, పోయి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో గంభీరావుపేట మండల కేంద్రంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో నరేష్ కు తలకు తీవ్ర గాయాలయ్యాయి.నరేష్ తలలో రక్తస్రావం కావడంతో ఉన్నత వైద్యం కోసంఎల్లారెడ్డిపేట లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నరేష్ పరిస్థితి విషమించడంతో ఇక బతికే అవకాశం లేదని ఇంటికి తీసుకెళ్లిపోవాలని వైద్యులు చెప్పడంతో,చేసేది లేక హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడివైద్యులు పరీక్షించి బ్రెయిన్‌డెడ్ అయ్యిందని, బతకడని చెప్పడంతో డాక్టర్స్ అవయవ దానం ఆవశ్యకత, అవగాహన కల్పించారు. అవయవదానం చేయాలని జీవన్ దాన్ సిబ్బంది కోరడంతో అ మాతృమూర్తి పుట్టాడు దుఃఖం లో ఉన్నా పెద్ద మనసు చేసుకుని అవయవ దానానికి అంగీకరించారు. దీంతో అతని రెండు మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు మరియు గుండె తీసి జీవన్దాన్ ద్వారా భద్రపరిచారు. అవయవాల దానం ద్వారా మరో ఆరుగురికి ప్రాణదానం చేసినట్లయ్యిందని వైద్యులు తెలిపారు. శనివారం నరేష్ మృతదేహాన్ని స్వగ్రామం నర్మాల లో అంత్యక్రియలు నిర్వహించారు. నరేష్ భౌతికంగా లేకున్నా అతని అవయవాల వితరణతో మరో ఆరుగురులో జీవించే ఉంటాడని అవయవ దానం చేయడం పట్ల నరేష్ మాతృమూర్తి కి పలువురు అభినందనలు తెలిపారు. ఇటు భర్త నర్సింలు, కొడుకు నరేష్ ఇద్దరు మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కులేని స్థితిలో పడింది. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని, ప్రభుత్వ పరంగా సహాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# పోలాండ్ పర్యటనకు ప్రధాని మోడీ..

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి విదేశీ పర్యటన చేపటనున్నారు. ఈ నెల 21న పోలాండ్‌లో పర్యటించనున్నారు. 45 సంవత్సరాల తర్వాత భారత ప్రధాని పోలాండ్ పర్యటనకు వెళ్తుండడం విశేషం. యూరప్‌లోని పోలాండ్ భారత్‌కు వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతున్నది. ఆ దేశానికి చెందిన 30 కంపెనీలు భారత్‌లో వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నది. ఆ దేశంలో భారత్‌కు చెందిన సుమారు 5వేల మంది సైతం విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఇక పోలాండ్ పర్యటన అనంతరం ప్రధారి ఉక్రెయిన్ వెళ్లనున్నారు. 23న ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్ స్కీతో మోదీ భేటీ కానున్నారు. రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసి ందే. అయితే, యుద్ధం ఆపేలా రష్యాను ఒప్పించాలని ఉక్రెయిన్ భారత ప్రధాని ని కోరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇద్దరు నేతలు భేటీకానుండడం ప్రాధాన్యం సంతరించుకున్నది. అయితే, దాదాపు 30 సంవత్సరాల తర్వాత భారత ప్రధాని ఉక్రెయిన్‌లో పర్యటిస్తుండడం ఇదే తొలిసారి.

# విద్యుద్ఘాతంతో దంపతులు మృతి

**బలగం టీవి, ఖమ్మం**

పండుగపూట విషాదం చోటు చేసుకుంది. విద్యుద్ఘాతంతో దంపతులు మృతి చెందారు. ఈ విషాదకర ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బస్వాపు రం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బస్వా పురం గ్రామానికి చెందిన బానోతు శ్రీను(42), షమీన(40)లు దాదాపు 20 ఏండ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. వారికి ఓ కుమార్తె ప్రియాంక ఉంది. భార్యాభర్తలిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే ఉదయం బట్టలు ఉతికిన షమీన ఇంటి ముందున్న ఇనుప తీగ(దండెం)పై ఆరేస్తుండగా.. ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌తో అక్కడికక్కడే పడిపోయింది. అదే సమయంలో వారి ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి షమీన కిందపడి ఉండటాన్ని గమనించి ఇంట్లో ఉన్న ఆమె భర్త శ్రీనుకు చెప్పాడు. కొంత కాలంగా అనా రోగ్యంతో బాధపడుతున్న షమీన అప్పుడప్పుడు స్పృహతప్పి పడిపోతూ ఉండేది. అలాగే పడిపోయిందనుకున్న శ్రీను తన భార్యను లేపేందుకు యత్నించాడు.దీంతో అతడికి కూడా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. దీనిని గమనించిన శ్రీను స్నేహితుడు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆ దంపతులను వెంటనే ఇల్లెందు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

పండుగ రోజు భార్యభర్తలిద్దరూ ప్రమాదవశాత్తు మృత్యు వాత పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుమార్తె ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ రాజారాం తెలిపారు.

# రుణమాఫీపై చిత్తశుద్ధి ఉంటే శ్వేత పత్రం విడుదల చేయాలి



**బలగం టీవి, కరీంనగర్**

- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని తన నివాసం వద్ద ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లా డారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ చేస్తున్న ప్రచారానికి, వాస్తవానికి పొంతన లేదని, సోనియాగాంధీ పుట్టిన రోజు రైతులందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కొందరికే మాఫీ చేశారని ఆరోపించారు. రూ.40వేల కోట్లు మాఫీ చేస్తామని చెప్పి రూ.17 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి సోనియా గాంధీనే మోసం చేసిన ఘనులు కాంగ్రెస్ నాయకులని విమర్శించారు. రైతు భరోసా, విద్యా భరోసా, మహాలక్ష్మి వంటి ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రజల గురించి పట్టించుకో వడం మానేసిందని, పాలనను గాలికి వదిలేసిందన్నారు. అడిగితే తప్ప స్పందించడం లేదని, కరీంనగర్ జిల్లాలో సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా వెంటనే రివ్యూ పెట్టి సమస్యను పరిష్కరించాలన్నారు.

# బస్సులో గర్భిణీకి ప్రసవం

- మానవత్వం చాటుకున్న కండక్టర్
- తేభినందించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

**బలగం టీవి, గద్వాల**



'రాఖీ పండుగ నాడు ఆర్టీసీ బస్సులో గర్భిణికి డెలివరీ చేసి ఒక మహిళా కండక్టర్ మానవత్వం చాటుకున్నారు. తాను విధులు నిర్వర్తిస్తోన్న బస్సులో గర్భిణికి పురిటి నొప్పులు రాగా, ఆమె వెంటనే స్పందించి బస్సులో ప్రయాణిస్తోన్న నర్సుతో కలిసి ప్రసవం చేశారు. అనంతరం తల్లీబిడ్డను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గద్వాల డిపోకు చెందిన గద్వాల– వనపర్తి రూట్ పల్లె వెలుగు బస్సులో సోమవారం ఉదయం సంధ్య అనే గర్భిణి రక్షాబంధనన్ సందర్భంగా తన సోదరులకు రాఖీ కట్టేందుకు వనపర్తికి వెళ్తున్నారు. బస్సు నాచహల్లి సమీపంలోకి రాగానే గర్భిణికి ఒక్కసారిగా పురిటినొప్పులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన మహిళా కండక్టర్ జి.భారతి బస్సును ఆపించారు. అదే బస్సులో ప్రయాణిస్తోన్న ఒక నర్సు సాయంతో గర్భిణికి పురుడు పోశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. అనంతరం 108 సాయంతో తల్లీబిడ్డను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు. ఈ మేరకు రక్షాబంధన్ సందర్భంగా బస్సులో గర్భిణీకి పురుడు పోసిన మహిళా కండక్టర్ భారతిని తెలంగాణ ఆర్‌టిసి ఎండి సజ్జనార్ అభినందించారు. 'రక్షాబంధన్ నాడు బస్సులో గర్భిణికి పురుడు పోసిన కండక్టర్ భారతికి ఆర్టీసీ యాజమాన్యం తరపున అభినందనలు. తాను సమయస్ఫూర్తితో

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం...

- ఐదుగురు మృతి.. నలుగురికి గాయాలు..



**బలగం టీవి, ముంబై**

మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముంబై నాసిక్ హైవేపై న్యూ కసర ఘాట్ సమీపంలో జరిగిన ఓ ఘోర ప్రమాదంలో పాల ట్యాంకర్ సుమారు మూడువందల అడుగుల దిగువకు ఉన్న ఓ లోయలో పడింది. దీంతో ఈ ఘోర ప్రమాదంలో అక్కడిక్కడే ఐదుగురు మృతిచెందగా, మరో నలుగురు ప్రయాణికులకు తీవ్రంగా గాపడినట్లు తెలుస్తోంది. థానె జిల్లాలోని కాసర్ ఘాట్ కొండ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న విపత్తు నిర్వహణ బృందం, హైవే పోలీసులు హుటాహుటినా ప్రమాదస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే భారీ వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు అధికారులు తెలిపారు. విపత్తు నిర్వహణ బృందం సంఘటనా స్థలం నుంచి మృతదేహాలను బయటకు తీయడంతోపాటు క్షతగాత్రులను తాళ్లతో పైకి తీసుకొచ్చి సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. స్థానికుల ఇచ్చిన పూర్తి వివరాల మేరకు.. పాల ట్యాంకర్ ముంబయి వెళుతున్న క్రమంలో, కొండపై మలుపు దగ్గర డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో వాహనం అదుపుతప్పి సుమారు 300 అడుగుల లోయలో పడిపోయింది. దీంతో సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు సహాయ చర్యలు చేపట్టారు.

# సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

త్రిపుల్ తలాక్ ముస్లిం మహిళల పరిస్థితిని దయనీయంగా మార్చిందని సోమవారం కేంద్రం సుప్రీంకోర్టులో పేర్కొంది. ఈ ఆచారం వివాహమనే సామాజిక ఆచారానికి ప్రమాదకరంగా మారిందని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వాదించింది.ఈ ఆచారాన్ని 2017లో సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ పక్కన పెట్టిన సంగతి తెలిసిందే. అయితే కొంతమంది ముస్లింలలో ఇప్పటికీ ఈ ఆచారం కొనసాగుతోందని అఫిడవిట్‌లో పేర్కొంది. ఈ పద్ధతి ద్వారా కొంతమంది ముస్లింలలో విడాకుల సంఖ్యను తగ్గించడంలో ప్రతిబంధకంగా పనిచేయలేదని తెలిపింది.త్రిపుల్ తలాక్ బాధితులు పోలీసులను ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేకపోవడం, చట్టంలో శిక్షార్హమైన నిబంధనలు లేకపోవడంతో బాధితుల భర్తలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పోలీసులు నిస్సహాయంగా మారారని, నిరోధించేందుకు కఠినమైన నిబంధనల తక్షణ అవసరం ఉందని వాదించింది.త్రిపుల్ తలాక్ విధానాన్ని సుప్రీంకోర్టు చెల్లుబాటు కాదని ఆదేశాలు జారీ చేయనందున దానిని నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదన్న పిటిషన్‌పై కేంద్రం కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేసింది.

# మమతా బెనర్జీకి విశ్వసనీయత శూన్యం

- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కారత్

**బలగం టీవి, న్యూఢిల్లీ**

కోల్‌కతా ట్రెనీ వైద్యురాలి లైంగికదాడి, హత్య కేసులో మమతా బెనర్జీ ప్రభుత్వానికి విశ్వసనీయత శూన్యమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కారత్ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తనను తాను రక్షించుకోవాలనుకుంటున్నారని, ఈ కేసులో నిందితులను దాచాలనుకుంటున్నారని అన్నారు. టీఎంసి ఎంపిల వాంగ్మూలాలు వింటుంటే తామే వైద్యులమంటూ తప్పుడు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని, కేసు వాస్తవికత గురించి వెల్లడించడం లేదని అన్నారు. వీటన్నింటి దృష్ట్యా ఈ విషయంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి విశ్వసనీయత శూన్యమని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. రాజ్యసభ ఎంపి సుఖేందు రారు ఈ కేసులో కీలక పాత్ర పోషించడానికి ప్రయత్నించారు అయితే వెంటనే పోలీసులు ఆయనకు కూడా సమన్లు జారీ చేశారని అన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి




**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండల కేంద్రంలో తెలంగాణ కల్లుగీత వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గుగ్గిళ్ళ శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షతన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరల దోపిడీని,జమీందారుల జాగీర్దారులు,పెత్తందారుల పెత్తనాన్ని ,ఆధిపత్య వర్గాల ఆగడాలను భరించలేక అన్యాయంగా ప్రజల కష్టార్జితాన్ని దోచుకునే తుష్కర సైన్యాన్ని ఎదిరించిన వీరుడని బహుజనులు కేవలం కులవృత్తులకే కాదు కత్తి పట్టి కదనరంగంలో కవాతు చేస్తూ శత్రువుల గుండెలను చీల్చగలరని నిరూపించారన్నారు. ప్రజల అండదండలతో ఖిలాసపూర్ లో , సర్వాయిపేట లో , భువనగిరి లో,తాటికొండలో కోటలను నిర్మించి చివరికి మొఘల్ రాజులను ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగర వేసిన మొదటి బహుజన చక్రవర్తి అని కొనియాడారు. కుల మత జాతి వర్గ విభేదాలు లేని సమాజం కోసం పరితపించారని, అగ్రవర్ణ బ్రాహ్మణ ఆధిపత్యా పోకడలను నిర్మూలించాలని సమ సమాజ స్థాపన కోసం కృషి చేశారన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల గ్రామ శాఖ అధ్యక్షులు,వివిధ కులాల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి అతిథిగా మండల కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ జలగం ప్రవీణ్ హాజరయ్యారు. తెలంగాణ కల్లుగీత వృత్తిదారుల సంఘం తంగళ్ల పల్లి మండలం అధ్యక్షుడు గుగ్గిల శ్రీకాంత్ గౌడ్, కందుకూరి రామ గౌడ్,ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్ గౌడ్, నేరెళ్ల నర్సింగం గౌడ్,కొత్త రవీందర్ గౌడ్,పొన్నం లక్ష్మణ్ గౌడ్,బాలసాని శ్రీనివాస్ గౌడ్, బండి సత్తయ్య గౌడ్,మద్దికుంట వెంకట్,సుద్దాల కర్ణాకర్ గౌడ్, సుద్దాల కొండయ్య గౌడ్,గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# అండర్-19 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల



బలగం టీవీ, దుబాయ్

మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో రెండో ఎడిషన్‌కు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. ఆదివారం ఐసీసీ ఒక ప్రకటన ద్వారా షెడ్యూల్‌ను ప్రకటించింది. మలేషియా ఆతిథ్యమివ్వనున్న ఈ టోర్నీ 2025 జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 దాకా కొనసాగనుంది. 16 జట్లు పాల్గొనబోయే ఈ మెగా టోర్నీలో జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనున్న భారత్.. గ్రూప్-ఏలో మలేషియా, వెస్టిండీస్, శ్రీలంకలో తలపడాల్సి ఉంది.గ్రూప్-బీ లో ఇంగ్లండ్, ఐర్లాండ్, పాకిస్థాన్, యూఎస్ఏ.. గ్రూప్-సీ లో సౌతాఫ్రికా, న్యూజిలాండ్, సమోవ, క్వాలిఫయర్ (ఆఫ్రికా రీజియన్ నుంచి) ఉండగా గ్రూప్-డీ నుంచి ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, స్కాట్లాండ్, క్వాలిఫయర్ (ఆసియా రీజియన్ నుంచి) చోటు దక్కించుకున్నాయి. ఈ టోర్నీ తొలి ఎడిషన్ (2023)లో షఫాలీ వర్మ సారథ్యంలోని యువ భారత జట్టు ఫైనల్‌లో ఇంగ్లండ్‌ను ఓడించి ప్రపంచకప్‌ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. కాగా రెండో ఎడిషన్‌లో జనవరి 19న వెస్టిండీస్‌తో జరుగబోయే మ్యాచ్‌తో భారత్ వరల్డ్ కప్ వేటను మొదలుపెట్టనుంది.

16 జట్లు పోటీపడనున్న ఈ టోర్నీ రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో జరుగనుంది. గ్రూప్ దశలో ఒక్కో జట్టు ప్రత్యర్థితో ఒక మ్యాచ్ ఆడనుండగా టాప్-3లో నిలిచిన జట్లు 'సూపర్ సిక్స్'కు అర్హత సాధిస్తాయి. ఈ దశలో 12 జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి రెండేసి మ్యాచ్‌లు ఆడతాయి. రెండు గ్రూపులలో టాప్-2లో ఉన్న జట్లు (4) సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. బ్యూమస్ ఓవల్ వేదికగా జనవరి 31న రెండు సెమీస్‌లు జరుగనుండగా ఫిబ్రవరి 2న ఫైనల్ పోరు జరుగనుంది. టీమ్‌ఇండియా సెమీస్ చేరితే రెండో సెమీఫైనల్స్ ఆడే అవకాశముంది. సెమీస్, ఫైనల్స్‌కు రిజర్వ్ డే లు ఉన్నాయి.

# టెస్ట్ ఛాంపియన్ షిప్.. అగ్రస్థానాంలోనే భారత్



బలగం టీవీ, హైదరాబాద్

వెస్టిండీస్‌లో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఆతిథ్య జట్టుపై సౌతాఫ్రికా గెలుపొందడం వల్ల ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ పాయింట్ల పట్టిక లో భారత్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. అటు తాజా విజయంతో సౌతాఫ్రికా ఐదో స్థానానికి చేరుకుంది. ఇక భారత్ ఇప్పటివరకు ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో ఆరు విజయాలతో 74 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మరోవైపు 90 పాయింట్లతో ఆసీస్ రెండో స్థానాన్ని సరిపెట్టుకుంది. ఆస్ట్రేలియాకు పాయింట్లు ఎక్కువే అయినప్పటికీ విజయాల శాతం భారత్‌కే అధికంగా ఉండటం వల్ల ఆసీస్ రెండో ప్లేస్‌కు పరిమితం కావాల్సొచ్చింది. ఇక భారత్ తదుపరి ఆడనున్న బంగ్లాదేశ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీస్‌ల్లో జోరు కొనసాగిస్తే, డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు చేరడం లాంఛనప్రాయమే. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ మ్యాచ్ ఆడతాయి.

కాగా, ఇప్పటివరకు భారత్ 68.51, ఆస్ట్రేలియా 62.50 విన్నింగ్ పర్సంటేజ్ నమోదు చేశాయి. అలాగే న్యూజిలాండ్ ఆరు మ్యాచుల్లో మూడు గెలిచి, మూడు ఓడిపోయింది. 50 శాతం పీసీటీతో నిలిచింది. నాలుగో స్థానంలో శ్రీలంక, ఐదో ప్లేస్‌లో దక్షిణాఫ్రికా నిలిచింది. చివరి నాలుగు స్థానాల్లో పాకిస్థాన్, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్, వెస్టిండీస్ జట్లు నిలిచాయి.

# దక్షిణాఫ్రికా.. సిరీస్ కైవసం



బలగం టీవీ, గయానా

వెస్టిండీస్‌తో గయానా వేదికగా జరిగిన రెండో టెస్టును దక్షిణాఫ్రికా గెలుచుకుంది. ఆట నాలుగో రోజు సఫారీలు నిర్దేశించిన 263 పరుగుల ఛేదనలో ఆతిథ్య విండీస్ 222 పరుగుల వద్దే ఆగిపోవడంతో సౌతాఫ్రికా 40 పరుగుల తేడాతో విజయం సాధించి మ్యాచ్‌తో పాటు సిరీస్‌ను 1-0తో సొంతం చేసుకుంది.ఛేదనలో కరీబియన్ జట్టును స్పిన్నర్ కేశవ్ మహారాజ్ (3/37), పేసర్లు కగిసో రబాడా (3/50), వియాన్ మల్డర్ (2/35) దెబ్బతీశారు. విండీస్ తరఫున గుడకేశ్ మోటీ (45) టాప్ స్కోరర్. ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ వచ్చే శుక్రవారం నుంచి మొదలుకానుంది.




# 'బ్రహ్మా ఆనందం' గ్లింప్స్ రిలీజ్

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ స్టార్ కమెడియన్ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'బ్రహ్మ ఆనందం వెన్నెల కిషోర్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ సినిమా ద్వారా ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకుడిగా పరిచయం అవుతుండగా.. మసూద లాంటి బ్లాక్ బస్టర్ అందుకున్న స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుడగా.. రాఖీ పండుగ సందర్భంగా మూవీ నుంచి గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ చూస్తే.. హీరో దరిద్రంను పర్స్‌లో పెట్టుకుని బ్రతుకుతున్నట్లు తెలుస్తుంది. మరి ఆ దరిద్రం నుంచి హీరో బయటపడ్డడా లేదా అనేది తెలియాలంటే సినిమా వచ్చేవరకు ఆగాల్సిందే. ఫుల్ హిలేరియస్‌గా ఉన్న ఈ గ్లింప్స్ ప్రస్తుతం ఆకట్టుకుంటుంది. ఈ సినిమాను డిసెంబర్ 6న విడుదల చేయనున్నారు మేకర్స్. ఇక ఈ గ్లింప్స్ చివరిలో బ్రహ్మానందం పంచెకట్టులో మాస్ ఎంట్రీ ఇచ్చాడు.!




# జనక అయితే గనక' విడుదలకు తేదీ ఖరారు

బలగం టీవీ, హైదరాబాద్

నటుడు సుహాస్ ప్రస్తుతం నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'జనక అయితే గనక'. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది ఈ మూవీ. సోమవారం ఈ సినిమాలోని లిరికల్ సాంగ్ ను విడుదల చేశారు మేకర్స్. అయితే సుహాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా రిలీజ్ డేట్ కూడా ఫిక్స్ చేసారు మేకర్స్. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 7న విడుదల చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ తాజాగా పోస్టర్ తో ప్రకటించింది.ఇక ఈ సినిమాలో సంగీర్తన హీరోయిన్‌గా నటించగా సందీప్ రెడ్డి బండ్ల డైరెక్ట్ చేశారు. విజయ్ బుల్గనిన్ సంగీతం అందించిన ఈ సినిమాలో రాజేంద్ర ప్రసాద్, మురళీ శర్మ, వెన్నెల కిషోర్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు.

# వరల్డ్ ఆఫ్ వాసుదేవ్ సాంగ్ విడుదల



కిరణ్ అబ్బవరం నటిస్తోన్న తాజా చిత్రం క. 1970స్ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణగిరి గ్రామం నేపథ్యంలో సాగే పీరియాడిక్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ మూవీని సుజిత్-సందీప్ డైరెక్ట్ చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి వరల్డ్ ఆఫ్ వాసుదేవ్ సాంగ్ లిరికల్ వీడియోను లాంచ్ చేశారు మేకర్స్. పోస్ట్‌మ్యాన్ వాసుదేవ్.. ఏ మొదలు తుదలు లేని ప్రయాణం.. అంటూ వాసుదేవ్ ప్రపంచం చుట్టూ సాగుతున్న ఈ పాట సినిమా ట్రాక్ ఎలా ఉండబోతుందో హింట్ ఇచ్చేస్తుంది. కిరణ్ అబ్బవరం ఈ సారి ఏదో కొత్త పాయింట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్టు అర్థమవుతోంది. ఈ మూవీలో 2018 ఫేం తాన్వి రామ్, గం గం గణేశా ఫేం నయన్ సారిక ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు.

వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ మూవీకి శ్యావమ్ సీఎస్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. కిరణ్ అబ్బవరం నుంచి వస్తోన్న తొలి పాన్ ఇండియా సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# కమిటీ కుర్రోళ్లకు చిరు అభినందనలు



బలగం టీవీ, హైదరాబాద్

మెగా డాటర్ నిహారికా కొణిదెల సమర్పణలో రూపొందిన 'కమిటీ కుర్రోళ్లు' సినిమా ఆగస్టు 9న రిలీజై సూపర్ రెస్పాన్స్‌తో థియేటర్లలో దూసుకుపోతోంది. చిన్న సినిమాగా రిలీజైన 'కమిటీ కుర్రోళ్లు' పెద్ద విజయం అందుకొని అందరి ప్రశంసలు పొందుతుంది. ఈ సినిమా సక్సెస్‌పై తాజాగా మెగాస్టార్ చిరంజీవి స్పందించారు. సినిమాలో నటించిన నటులందరూ కథాకు అనుగుణంగా మేకోవర్ అవ్వడమే కాకుండా, చక్కగా వారి పాత్రల్లో ఒదిగిపోయారని చిరంజీవి అన్నారు. అలాగే మూవీటీమ్‌ను ఇంటికి పిలిచి మరీ అభినందించారు."కమిటీ కుర్రోళ్ళు' సినిమా చూశా. చిత్రం అద్భుతంగా ఉంది. అందరూ కొత్త కుర్రాళ్లే. చాలా బాగా నటించారు. సినిమా చూస్తున్నప్పుడు కొత్తవాళ్లు నటిస్తున్నారనే విషయం మర్చిపోయా. ఎమోషనల్ సీన్స్ చాలా చక్కగా పండాయి. నటీనటులందరూ కథానుగుణంగా మేకోవర్ అయిన తీరు అద్భుతం. సినిమాను నేచురల్‌గా చిత్రీకరించటం కోసం మొత్తం టీమ్ పడిన కష్టం తెరపై కనిపించింది. బడ్జెట్‌లో సినిమాను తెరకెక్కించిన దర్శకుడు యదువంశీకి ప్రత్యేకమైన అభినందనలు. డైరెక్టర్?గా తను చక్కటి ప్లానింగ్‌తో సినిమాలోని ప్రతీ సీన్?ను ముందుగా డిజైన్ చేసుకోవటం వల్ల బాగా తీయగలిగారు' అని చిరంజీవి అన్నారు.